

సంతోషంగా జీవించాలి

జ్యోతినగర్ : ఉద్యోగ విరమణ చేశాక సుఖ, సంతోషాలతో ఉండాలని ఎన్టీపీసీ ఏజీఎం బిజయ్ కుమార్‌సిగ్దర్ ఆకాంక్షించారు. పీఆర్వో విష్ణువర్ధన్ రావు ఉద్యోగ విరమణ సందర్భంగా మాట్లాడారు.



గుంతల రోడ్లపై గులాబీలతో నిరసన

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని గుంతల రోడ్లపై గులాబీ పూలు చల్లుతూ సీపీఐ పార్టీ నాయకులు వినూత్నంగా నిరసన తెలిపారు. కల్యాణ్‌నగర్ లో ఫ్లెక్సీలు పట్టుకొని నినాదాలు చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
31.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం అధికంగా నమోదవుతుంది. జిల్లాలోని పలుచోట్ల ఉరుములతో కూడిన చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

భూసమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ఎలిగేడు(పెద్దపల్లి): పెండింగ్‌లోని భూసమస్యలను సకాలంలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. రికార్డులు, భూసమస్యలు, సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ పరిశీలించారు. గ్రామీణస్థాయిలోని భూసమస్యలను గుర్తించి విచారణ జరిపి పరిష్కరించాలని చెప్పారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దారు స్వర్ణ, ఎంపీడీవో భాస్కర్‌రావు, ఆర్‌ఐ జయ, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే కటకటాలే



శ్రీనివాస్

గోదావరిఖని: నేరాలకు పాల్పడితే కఠిన శిక్షలు అనుభవించాల్సి ఉంటుందని రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ప్రస్తుత సాంకేతికతకు అనుగుణంగా జూలై 1వ తేదీ నుంచి నూతన చట్టాల అమల్లోకి వచ్చాయన్నారు. ఈక్రమంలో 49 కేసుల్లో 80 మంది నిందితులకు జైలు శిక్ష రూ.59వేల జరిమానా విధించినట్లు పోలీసు కమిషనర్ శ్రీనివాస్ వెల్లడించారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్ సీజీఎంకు పదోన్నతి



సుధీర్‌కుమార్ ఝా

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ కర్మాగారం చీఫ్ జనరల్ మేనేజర్ సుధీర్ కుమార్ ఝాకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ)గా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఆయన ఆర్‌ఎఫ్‌సీఎల్ యూనిట్ నుంచి నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్, హరియాణాలోని పానిపట్ యూనిట్‌కు శుక్రవారం బదిలీ అయ్యారు. సుధీర్ కుమార్ ఝా 2016 ఆగస్టు 1న ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో డీజీఎంగా బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత జీఎంగా, సీజీఎంగా, ప్రస్తుతం ఈడీగా పదోన్నతి పొందారు. ఆయన స్థానంలో ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో సీజీఎం(ఓఅండ్‌ఎం) ఉదయ్ రాజహంసను ఇన్‌చార్జి సీజీఎంగా నియమించారు. సుధీర్ కుమార్ ఝాను అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.

అందరికీ రుణమాఫీ

కమాన్‌పూర్(మంథని): తమకు రుణమాఫీ వర్తించలేదని రైతులు ఆందోళన చెందవద్దని, అర్హులందరికీ ఈ పథకం వర్తిస్తుందని జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి తెలిపారు. స్థానిక ఎస్‌బీఐని శుక్రవారం ఆయన సందర్శించారు. మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్లతో మాట్లాడారు. రుణమాఫీ వివరాలపై ఆరా తీశారు. రైతులతో మాట్లాడారు. రుణమాఫీ కానీ రైతులు రైతువేదికల్లో ఏఈవోలను కలిసి దరఖాస్తు చేస్తే అర్హులకు రుణమాఫీ చేస్తారని వివరించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం సందర్శించి పరిసరాలు పచ్చదనం, సీజనల్ వ్యాధులపై సమీక్షించారు. జూలపల్లి మండలం ముల్కలపల్లిలో పంటలు పరిశీలించారు. ఏవో ప్రమోద్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో సురేశ్, ఎంపీవో భాస్కర్, ఏపీవో లావణ్య పాల్గొన్నారు.

ముగిసిన ఆపరేషన్ ముస్కాన్



చిన్నారులను బడిలో చేర్పిస్తున్న అధికారులు

గోదావరిఖని: జిల్లాలో గతనెల ఒకటో తేదీన చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్–10 ముగిసింది. నెలరోజులపాటు ప్రత్యేక బృందాలు శ్రమించి 70మంది చిన్నారులను చేరదీశారు. రామగుండం కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో 70 మందిని గుర్తించగా, అందులో 30 మంది మంచిర్యాల, 40మంది పెద్దపల్లికి చెందిన చిన్నారులున్నారు. వీరిలో 18మంది బాలకార్మికులు, ఇద్దరు భిక్షాటన చేసేవారు, 50మంది డ్రాపవుట్ పిల్లలు ఉన్నారు. ఆపరేషన్ ముస్కాన్ నిర్వహణ కోసం రామగుండం సీపీ శ్రీనివాస్ నేతృత్వం వహించారు. ఇందులో ప్రత్యేక ఏసీపీని నియమించారు. సబ్ డివిజన్‌కు ఒక ఎస్సై చొప్పున ఐదుగురిని నియమించారు. నెలరోజులపాటు వీరు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ సత్ఫలితాలు ఇచ్చింది.

'డీఎస్సీ'కి 451 మంది హాజరు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో శుక్రవారం జరిగిన డీఎస్సీ పరీక్షకు 451మంది అభ్యర్థులు హాజరయ్యారని డీఈవో మాధవి తెలిపారు. 550మందికి 451 మంది హాజరయ్యారని వివరించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

జెరం జారలే..





జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో డాక్టరు గది ఎదుట పేషెంట్ల బారులు

- వణికిస్తున్న విషజ్వరాలు
- వేధిస్తున్న డెంగీ
- చుట్టుముట్టిన వ్యాధులు
- ఆస్పత్రులకు జనం పరుగులు

సాక్షి FOCUS

పెద్దపల్లిరూరల్: వైరల్‌ఫీవర్, డెంగీ, విషజ్వరాలు జిల్లాను వణికిస్తున్నాయి. దీనికితోడు మలేరియా, టైఫాయిడ్ లక్షణాలతో తరలివచ్చే వ్యాధిగ్రస్తులతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు రద్దీగా మారాయి. కొద్దిరోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో నీటినిల్వలు భారీగా పెరిగిపోయాయి. పారిశుద్ధ్యం లోపించింది. దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి. సమీపంలోని జనాలపై దాడులు చేస్తున్నాయి. ఫలితంగా విషజ్వరాలు, డెంగీ, జలుబు, చికున్‌గున్యా లాంటి సీజనల్ వ్యాధులు జిల్లావాసులను పట్టి పీడిస్తున్నాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి పేషెంట్ల తాకిడి పెరిగింది. ఈ ఆస్పత్రిలో అవుట్ పేషెంట్ల సంఖ్య రోజూ 500కు పైగా నమోదవుతోందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.



ఈ యువతి పేరు శనిగరపు శ్రీలత(35). స్వగ్రామం మొట్లపల్లి. ఐదురోజులుగా జ్వరంతో బాధపడుతోంది. తీవ్ర అస్వస్థతకు గురవడంతో తొలుత జమ్మికుంటకు అక్కడి నుంచి హుజూరాబాద్, ఆ తర్వాత వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్స చేయించారు. అయినా, నయం కాలేదు. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించి గురువారం రాత్రి మృతి చెందింది. శ్రీలతకు భర్త శ్రీనివాస్, కుమారులు శ్రీహర్ష, శ్రీసూర్య ఉన్నారు. ఇంటిదేవత కన్నుమూయడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

– కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి)

జిల్లాలో డెంగీ, మలేరియా, చికున్‌గున్యా కేసులు

సంవత్సరం	డెంగీ	మలేరియా	చికున్‌గున్యా
2019	194	04	04
2020	11	02	02
2021	334	02	–
2022	315	05	–
2023	518	–	–
2024	51	–	–

ఓపీ వివరాలు

తేదీ	కేసులు
ఈనెల 2	509
ఈనెల 1	505
జూలై 26	210
జూలై 27	140
జూలై 29	450
జూలై 30	390
జూలై 31	395

నీటి నిల్వతో..

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలతో వర్షపు నీరు ఎక్కడపడితే అక్కడ నిల్వ అవుతోంది. ఇళ్లలోని వ్యర్థాలు, ఇంటి ఆవరణలోని గుంతలు, వీధుల్లోనూ రోజుల తరబడి నిలిచి ఉంటోంది. ఫలితంగా దోమలు, ఈగలు, బ్యాక్టీరియా వృద్ధి చెందుతున్నాయి. ప్రతీ శుక్రవారం డ్రైడే ఫ్రైడే అని అధికారులు అవగాహన కల్పిస్తున్నా వ్యాధుల తీవ్రత రోజురోజుకూ పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

వార్డులు ఫుల్లు..

జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలోని వార్డులు జ్వర పీడితులతో నిండిపోయాయి. పెద్దపల్లి పట్టణం, రామగుండం నగరం, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలతో సమీప మండలాలకు చెందిన పేషెంట్లు వస్తుండడంతో రద్దీ పెరుగుతోంది. పెద్దపల్లి ప్రాంతంలో జ్వరంతోపాటు కీళ్లనొప్పులు ప్రజలను వేధిస్తున్నాయి. అయితే, చికున్‌గున్యా లక్షణాలు కావడంతోనే కీళ్లనొప్పులు వస్తున్నాయని కొందరు పేషెంట్లు ఆందోళన చెందుతున్నారు.



ప్రభుత్వ ఆస్పత్రిలో బెడ్లపై పేషెంట్లు



అస్వస్థతకు గురై మంచంపట్టిన పేషెంట్లు

పెరిగిన ఓపీ..

జిల్లా ఆస్పత్రిలో అవుట్ పేషంట్ల సంఖ్య పెరుగుతోంది. ఇప్పటివరకు రోజూ 120 – 200 వరకు వచ్చే అవుట్‌పేషంట్ల సంఖ్య శుక్రవారం ఏకంగా 509గా నమోదైంది. సోమ, మంగళవారాల్లో ఓపీ సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఫార్మసీ వద్ద సైతం మందుగోళీల కోసం బారులు తీరుతున్నారు.



నొప్పలతో వచ్చిన



కొద్దిరోజులుగా జెరం, ఒంటినొప్పులతో బాధ పడుతున్న. ఎంతకీ నయం కాకపోవడంతో పెద్దపల్లి సర్కార్ దవాఖానకు వచ్చిన. పరీక్షలు చేసిన డాక్టర్లు.. మందుగోళీలు రాసిండ్రు.

– కొమ్ము మల్లయ్య, మంగపేట

వాంతులు, వీరేచనాలు



కొద్దిరోజుల నుంచి వాంతులు, విరేచనాలు అయితన్నయ్.. మా ఊళ్లో దవాఖానకు పోతే తగ్గలే. సర్కార్ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్న. ఇప్పుడు కొంత నయమైంది.

– రాజమ్మ, చందపల్లి

అప్రమత్తం చేశాం

సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. నియంత్రణకు సిబ్బందిని అప్రమత్తం చేశాం. జ్వరసర్వే చేశాం. బాధిత ప్రాంతాల్లో వైద్యశిబిరాల ద్వారా సేవలు అందిస్తున్నాం. పరిసరాల పరిశుభ్రత, ఆహారం, ఇతర అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం.

– ప్రమోద్‌కుమార్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి

శ్రద్ధతో స్వచ్ఛదనం.. పచ్చదనం

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష, అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ, డీపీవో ఆశాలత

పెద్దపల్లిరూరల్: జిల్లాలో స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీతో కలిసి ఆయన మాట్లాడారు. ఈనెల 5 – 9వ తేదీ వరకు ఈ స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణపై అవగాహన కల్పించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలన్నారు. పల్లెలు మల్టీపర్పస్ వర్కర్లతో పరిపరిశుభ్రంగా ఉంచేలా చూడాలని ఆయన అన్నారు. ప్రభుత్వ ఆస్తుల్లో పరిశుభ్రత, పచ్చదనం కనిపించేలా చూడాలన్నారు. శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ భవనాలను కూల్చేయాలని సూచించారు. రోడ్లపై గుంతలను ప్రజల భాగస్వామ్యంతో పూడ్చేలాచూడాలని పేర్కొన్నారు. దోమల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు కలిగిన తాగునీటినే సరఫరా చేయాలని సూచించారు. సమావేశంలో డీపీవో ఆశాలత, డీఆర్డీవో రవీందర్, మున్సిపల్ కమిషనర్లు, డీఎఫ్‌వో శివయ్య, డీఎంహెచ్‌వో ప్రమోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ హయాంలోనే హైదరాబాద్ స్పోర్ట్స్ హబ్

- అసెంబ్లీలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో తాను 'శాప్' చైర్మన్‌గా ఉన్నానని, ఆ సమయంలోనే హైదరాబాద్ మహానగరాన్ని స్పోర్ట్స్ హబ్‌గా మార్చారని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఇద్దరు క్రీడాకారులను ప్రోత్సహిస్తూ ఉద్యోగాలు కల్పించడం ప్రశంసనీయమన్నారు. గత ప్రభుత్వం క్రీడలను నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. తమ హయాంలో 36 అకాడమీలు, 38 ఇంటర్నేషనల్ ఈవెంట్లు, వెయ్యి నేషనల్ ఈవెంట్లు నిర్వహించామని అన్నారు. నియోజకవర్గాల స్థాయిలో స్టేడియంతోపాటు ప్రతీస్కూల్లో క్రీడా ప్రాంగణం ఉంటే విద్యార్థి దశ నుంచే చిన్నారులు క్రీడల్లో రాణిస్తారని ఆయన తెలిపారు. సానియా మీర్జా, సైనా నెహ్వాల్, జేజే శోభ, సద్గీత జ్వాలా లాంటి క్రీడాకారులను తయారుచేసి అర్జున్, పద్మశ్రీ అవార్డులు తీసుకొచ్చిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. శామీర్‌పేట్, హకీంపేటలో 250 ఎకరాల అకాడమీ స్థలం ఉందని, అక్కడ 11స్టాండర్డ్ చదివిన తర్వాత విద్యార్థులు అంతర్జాతీయ క్రీడాకారులుగా తయారవుతున్నారని గుర్తుచేశారు. అక్కడ ఒక్కొక్కరికి రూ.రెండు లక్షలు ఖర్చుచేస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్‌లో హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయిలో స్పోర్ట్స్ హబ్‌గా తయారవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 2032లో ఇండియాలోనే ఒలిపింక్స్ పోటీలు జరుగుతాయని ఆయన తెలిపారు.

మెడలో నల్లకండువా.. చేతిలో ప్లకార్డు

- బల్దియా ఎదుట కార్పొరేటర్ నిరసన
- మౌలిక సౌకర్యాలు కల్పించాలని కన్నూరి సతీశ్‌కుమార్ డిమాండ్



నిరసన తెలుపుతున్న కార్పొరేటర్ సతీశ్‌కుమార్

కోల్‌సిటీ(రామగుండం): మౌలిక సదుపాయాల కల్పన కోసం నగర ప్రజలు మొరపెట్టుకున్నా వినని బల్దియా.. చివరకు కార్పొరేటర్ ఆవేదననూ పట్టించుకోవడం లేదు. ఇందుకు నిదర్శనమే తమ డివిజన్‌లో సదుపాయాలు కల్పించాలనే డిమాండ్‌తో 20వ డివిజన్ కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్ మెడలో నల్లకండువా ధరించి, చేత ప్లకార్డు కార్డు పట్టుకుని బల్దియా కార్యాలయం ఎదుట శుక్రవారం బైఠాయించడం. ఈ సందర్భంగా ఆయన అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తన డివిజన్‌లో కనీస వసతులు కల్పించకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రిపేరు సాకుతో నెలరోజులుగా చెత్త సేకరణ ఆటోట్రాలీ రావడం లేదన్నారు. నాలుగు డివిజన్లలోని చెత్త తరలించడానికి ఒక్కటే ట్రాక్టర్ పంపిస్తున్నారని, దాని సెల్ఫ్ కూడా పనిచేయడం లేదని తెలిపారు. వీధిదీపాలు వెలగడం లేదని, తాగునీటి సమస్య వేధిస్తోందని అధికారులకు విన్నవించినా స్పందించడం లేదన్నారు. సౌకర్యాల కల్పన కోసం బల్దియా ఎదుట తాను నిరసన చేయాల్సి రావడం విచారకమన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్ స్పందించి నిరసన విరమించాలని సతీశ్‌కుమార్‌కు నచ్చజెప్పారు. సోమవారం నుంచి ఆటోట్రాలీతోపాటు అదనపు ట్రాక్టర్‌ను కూడా పంపిస్తామని హామీ ఇవ్వడంతో కార్పొరేటర్ ఆందోళన విరమించారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

పెద్దపల్లిరూరల్: గర్భస్థ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ప్రమోద్ కుమార్ అన్నారు. గర్భస్థ పూర్వ, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం–1994 నిబంధనలను జిల్లాలో కచ్చితంగా అమలు చేస్తామన్నారు. శుక్రవారం నిర్వహించిన జిల్లా సలహా కమిటీ సమావేశంలో పలు సూచనలు చేశారు. జిల్లాలో 31 స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయని, ప్రతీ సెంటర్ ఫారం–ఎఫ్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. జిల్లాలో జరిగే డెలివరీల్లో ప్రతీవెయ్యి మందికి 924మంది ఆడపిల్లలు జన్మిస్తున్నారని తెలిపారు. ఆడపిల్లలను కాపాడుకోవాలని సూచించారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కన్వీనర్ రాజ్‌గోపాల్, ప్రతినిధులు రవీందర్, వెంకటేశ్వర్లు, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఇళ్లపట్టాలు



పెండింగ్ కేసుతో జాప్యం..

నిర్వాసితులకు ఇళ్ల పట్టాలు జారీచేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలనే హైకోర్టు ఆదేశాలతో సింగరేణి వేగంగా స్పందించింది. అంతకుముందు అంటే.. 2021లో ఉన్న పెండింగ్ కేసు నేపథ్యంలో అధికారులు భూ సర్వేచేశారు. తుది తీర్పు ప్రకారం సింగరేణి తన అదినంలోని భూములను రెవెన్యూ శాఖకు అప్పగించాలని హైకోర్టు జూలై 12న ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు సింగరేణి అధీనంలోని భూములు అప్పటించాలని పెద్దపల్లి జిల్లా రెవెన్యూ అధికారులు ఇటీవల ఆర్జీ–2 అధికారులకు లేఖ రాశారు. ప్రక్రియ పూర్తికావడంతో త్వరలోనే ఇళ్లపట్టాలు జారీచేయనున్నారు.

- తీరనున్న మూడు దశాబ్దాల కల
- హైకోర్టు తుదితీర్పుతో సర్వే

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణి ప్రభావిత న్యూమారేడుపాక నిర్వాసితుల సుమారు మూడు దశాబ్దాల కల త్వరలోనే నెరవేరబోతోంది. ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు(ఓసీపీ)–3 విస్తరణ కోసం సింగరేణి యాజమాన్యం 1989లో న్యూమారేడుపాక పరిధిలోని భూములు, నివాసాలను స్వాధీనం చేసుకుంది. న్యూమారేడుపాక, కృష్ణానగర్, పోచంపల్లి, వెంకట్రావుపల్లి గ్రామాల్లోని నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు నరసింహపురంకాలనీ పేరిట ఆర్ అండ్ ఆర్ కాలనీ నిర్మించింది. ఇందుకోసం సమీపంలోని అల్లూరు, పెంచికల్‌పేట గ్రామ శివారుల్లో 9 లే అవుట్లు ఏర్పాటు చేసింది. అందులో దాదాపు 2 వేల ప్లాట్లు ఏర్పాటు చేసింది. 1996లో నిర్వాసితులకు వాటిని కేటాయించింది.

సంతోషంగా ఉంది



మాకు ప్లాటు ఇచ్చిన అధికారులు పట్టా ఇవ్వలేదు. ఇల్లు కట్టుకుందామంటే చేతిల పైసల్లేవు. లోను కోసం బ్యాంకులకు పోతే పట్టా కావలన్నరు. ఇప్పటికైనా అధికారులు ఇల్లు పట్టా ఇస్తమనడం సంతోషంగా ఉంది.

– తాళ్ల నరేందర్, నిర్వాసితుడు, న్యూమారేడుపాక

త్వరలోనే పట్టాలు



ఓసీపీలో భూములు కోల్పోయిన గ్రామస్తులు అందరికీ సింగరేణి ప్లాట్లు ఇచ్చింది. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం అర్హులైన నిర్వాసితులకు ఇళ్ల పట్టాలు వెంటనే జారీచేసేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి.

– తాళ్ల అమృత, కార్పొరేటర్, న్యూమారేడుపాక

వెయ్యి కుటుంబాలకు న్యాయం



సింగరేణి యాజమాన్యం నిర్వాసితులకు కేటాయించిన ప్లాట్లకు ఇళ్ల పట్టాలు జారీచేస్తే దాదాపు వెయ్యి కుటుంబాలకు న్యాయం జరుగుతుంది. సింగరేణి తన అధీనంలోని భూములను వెంటనే రెవెన్యూ అధికారులకు అప్పగించాలి.

– నాగరాజు, న్యాయవాది

ప్లాట్లు కేటాయించినా పట్టాలు ఇవ్వలేదు

- నిర్వాసితులు ఇళ్ల నిర్మించుకునేందుకు ప్లాట్లు కేటాయించిన సింగరేణి.. నిర్వాసితులకు ఇళ్లపట్టాలు జారీచేయలేదు.
- ఫలితంగా ఇళ్ల నిర్మాణానికి బ్యాంకుల నుంచి రుణాలు మంజూరు కాలేదు.
- కనీసం ప్లాట్లపై యాజమాన్య హక్కులు కూడా లేకుండాపోయాయి.
- దీంతో పట్టాల కోసం నిర్వాసితులు సింగరేణి, రెవెన్యూ అధికారుల చుట్టూ సుమారు మూడు దశాబ్దాలుగా ప్రదక్షిణలు చేసినా ఫలితం లేకుండాపోయింది.
- విసిగివేసారిన న్యూమారేడుపాక నిర్వాసితులు 2018లో గోదావరిఖని కోర్టును ఆశ్రయించారు.
- ఇక్కడ కూడా న్యాయం జరగలేదు. ఫలితంగా 2019లో హైకోర్టును ఆశ్రయించారు.
- పూర్వాపరాలు పరిశీలించిన హైకోర్టు.. నిర్వాసితులకు ఇళ్లపట్టాలు జారీచేయాలని 2024 ఏప్రిల్ 15న ఉత్తర్వులు జారీచేసింది.

ఇబ్బందులు ఎదుర్కొన్నాం



సింగరేణి అధికారులు మాకు ప్లాటు ఇచ్చిండ్రు. పట్టాలు ఇవ్వలేదు. ఇల్లు కట్టుకునేందుకు అనుమతి కావాలని దరఖాస్తు చేస్తే అనుమతి రాలే. ప్లాటు అమ్ముకోవడానికి వీలులేకుండాపోయింది. ఆర్థికంగా ఇబ్బంది ఎదుర్కొన్నం.

– జి.సతీశ్, నిర్వాసితుడు, న్యూమారేడుపాక

అనధికార నివాసాలపై విచారణ జరపండి

- మంథని ఆర్డీవో హనుమా నాయక్



మాట్లాడుతున్న ఆర్డీవో హనుమా నాయక్

రామగిరి(మంథని): రాజాపూర్ గ్రామంలో నిర్మించిన అనధికార నివాసాలపై విచారణ జరపాలని మంథని ఆర్డీవో హనుమా నాయక్ ఆదేశించారు. శుక్రవారం తహసీల్ కార్యాలయంలో రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసు, సింగరేణి అధికారులతో ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. బుధవారంపేట శివారులో సింగరేణి సుమారు 88 ఎకరాల సేకరణకు నోటిఫికేషన్ జారీచేసిందన్నారు. అయితే, రాజాపూర్ గ్రామ పరిధిలో సింగరేణి సేకరించిన స్థలంలో సుమారు 51 నివాసాలు అనుమతి లేకుండా ఎలా నిర్మించారని ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించారు. ఈ స్థలం రికార్డుల్లో సింగరేణి పేరిట ఉందని అన్నారు. అనుమతి లేకుండా నిర్మించిన ఇళ్ల పరిశీలించి, భూహక్కు, నాలా కన్వర్షన్ పత్రాలు తనిఖీ చేయాలని సూచించారు. అనధికార గృహ యజమానులకు నోటీసులు జారీచేయాలని అన్నారు. తహసీల్దార్ రాంచందర్‌రావు, ఎస్సై సందీప్, ఎంపీడీవో శైలజారాణి, సింగరేణి అధికారులు రఘుపతి, ఐలయ్య, లక్ష్మీనారాయణ, శ్యామల, డిప్యూటీ తహసీల్దార్ మానస, ఎంపీవో పాషా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గంజాయి పట్టివేత



మేడిపల్లి(వేములవాడ): మేడిపల్లి మండలం కొండాపూర్‌లో గంజాయి విక్రేతను పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన మ్యాకల శ్రీకర్ సులువుగా డబ్బు సంపాదించేందుకు గంజాయి విక్రయాలకు అలవాటుపడ్డాడు. గురువారం సాయంత్రం మేడిపల్లి మండలం కొండాపూర్‌లో తన బంధువులు, యువకులకు విక్రయించేందుకు 565 గ్రాముల గంజాయి తీసుకురాగా పక్కా సమాచారంతో ఎస్సై శ్యాంరాజు పట్టుకుని నిందితుడి నుంచి గంజాయి, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా ఎస్సై శ్యాంరాజ్, సిబ్బంది చంద్రశేఖర్, దినేశ్, అనిల్ తదితరులను ఎస్పీ అభినందిచారు.

పిచ్చికుక్క దాడిలో గాయపడిన చిన్నారి



కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలం కొండాపూర్‌లో శుక్రవారం పిచ్చికుక్క దాడిలో చిన్నారికి తీవ్రగాయాలయ్యాయి. చైత్ర(4) సాయంత్రం ఇంటి బయట ఆడుకుంటుండగా పిచ్చికుక్క దాడి చేయడంతో మెడ, చేతిపై గాయాలయ్యాయి. వెంటనే కొడిమ్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు యత్నించగా, అక్కడా ఎవరూ లేరని తెలియడంతో ఓ ఆర్‌ఎంపీ వద్ద ప్రథమ చికిత్స చేయించారు. కాగా పిచ్చికుక్క దాడిలో గ్రామంలోని మరో పెంపుడు కుక్క సైతం గాయపడినట్లు స్థానికులు తెలిపారు.

చిన్నారి వైద్యానికి రూ.10 లక్షలు

- అండగా నిలిచిన రాజన్నసిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ
- మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు చర్యలు
- చిన్నారి తల్లి, మండల తహసీల్దార్ పేరిట జాయింట్ ఖాతా
- 'సాక్షి' కథనానికి స్పందన





ముక్కు ద్వారా ఆహారం అందిస్తున్న తల్లి శ్యామల, మెడికల్ రిపోర్టులు పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ

వీర్నపల్లి(సిరిసిల్ల): కేన్సర్‌తో బాధపడుతున్న చిన్నారి నయనశ్రీ వైద్యానికి ఆర్థిక సహాయం అందించేందుకు రాజన్నసిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ ముందుకొచ్చారు. చిన్నారిని శుక్రవారం పరామర్శించి, ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. నయనశ్రీ కేన్సర్‌తో బాధపడుతోందని, వైద్యానికి డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారని 'నా బిడ్డకు అయుష్షు పోయండి' శీర్షికన గత నెల 31 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ స్పందించారు. చిన్నారి మెరుగైన వైద్యానికి అవసరమైన డబ్బులను అందించేందుకు ఏర్పాటు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం గర్జనపల్లికి చెందిన గజ్జెల దిలీప్–శ్యామల దంపతుల చిన్నకూతురు నయనశ్రీ కేన్సర్‌తో బాధపడుతోంది. చికిత్స కోసం డబ్బులు లేవంటూ దాతలు సహాయం కోరగా.. చిన్నారి చికిత్సకు సంపూర్ణ మద్దతు అందించేందుకు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ ముందుకొచ్చారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లిలోని చిన్నారి ఇంటిని శుక్రవారం కలెక్టర్ సందర్శించారు. చిన్నారికి వైద్యం అందించేందుకు ఇప్పటికే తల్లిదండ్రులు రూ.3 లక్షలు అప్పుచేశారని తెలుసుకున్నారు. నయనశ్రీకి చికిత్స అందించేందుకు ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందన్నారు. వీర్నపల్లి తహసీల్దార్, చిన్నారి తల్లి పేరిట జాయింట్ బ్యాంకు ఖాతా ప్రారంభించి, వెంటనే వైద్యఖర్చుల నిమిత్తం రూ.10లక్షలు జమచేశారు. చిన్నారికి మెరుగైన వైద్యం ఎక్కడ అందించాలన్న అంశంపై నివేదిక ఇవ్వాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారికి సూచించారు. డీఎంహెచ్‌వో రిపోర్ట్ ప్రకారం చికిత్స ప్రా రంభించాలని, ఖాతాలో జమచేసిన నిధులు చికిత్స కోసం వినియోగించాలని సూచించారు. అవసరమైతే మరిన్ని నిధులు కూడా అందించడానికి సిద్ధంగా ఉన్నామని, తల్లిదండ్రులు ఆందో ళన చెందొద్దని భరోసానిచ్చారు. చి కిత్స విషయమై ఏ సమయంలోనైనా నేరుగా తనకు ఫోన్‌చేయాలని కలెక్టర్ తెలిపారు. డీఎంహెచ్‌వో వసంతరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ మారుతిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, ఆర్‌ఐ ప్రవీణ్, మెడికల్ సిబ్బంది చిరంజీవి, మంజుల, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

అంజనశ్రీకి అండగా 'తేజశ్రీ'



'సాక్షి'లో ప్రచురితమైన కథనం



కృత్రిమ కాలు అందజేస్తున్న ట్రస్ట్ వ్యవస్థాపకులు పైడిరాజు

- రూ.2.10 లక్షలతో కృత్రిమ కాలు

రాయికల్(జగిత్యాల): రాయికల్ పట్టణంలోని కూచిపూడి కళాకారిణి దివ్యాంగురాలైన అంజనశ్రీకి రాజమండ్రికి చెందిన తేజశ్రీ చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. ట్రస్ట్ వ్యవస్థాపకుడు కొలిమెల్ల పైడిరాజు స్పందించి రూ.2.10 లక్షల విలువైన కృత్రిమ కాలును బయోనిక్ సంస్థ ద్వారా చేయించి శుక్రవారం అంజనశ్రీకి అందజేశారు. మే 15న 'సాక్షి'లో 'అంజనశ్రీని ఆదుకోండి' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో ట్రస్ట్ సభ్యులు శ్రీమతి దర్శిని, వెంకటనరేశ్, రామారావు, విష్ణుల సహకారంతో అంజనశ్రీకి కృత్రిమ కాలు అందించారు. భవిష్యత్‌లో నాట్యమయూరిగా పేరు ప్రఖ్యాతలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అరికపూడి సేవ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రఘు, దయ్యాల మహేశ్, లావణ్య, రసజ్ఞ పాల్గొన్నారు.

భార్య అవయవదానంతో భర్తకు అరుదైన గౌరవం



నర్సయ్యను సన్మానిస్తున్న అధికారులు

సారంగాపూర్(జగిత్యాల): చనిపోయిన భార్య అవయవాలు దానం చేయడంతో భర్తకు అరుదైన గౌరవం దక్కింది. వివరాలు.. బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామానికి చెందిన పొనగంటి నర్సయ్య భార్య పద్మ గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేసేది. గతేడాది తన ఇంట్లో బాత్‌రూంలో కింద పడి స్పృహ కోల్పోయింది. చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించగా ఫిబ్రవరి 28, 2023లో మృతిచెందింది. ఈ క్రమంలో నర్సయ్య పిల్లలతో చర్చించి పద్మ అవయవాలను హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో దానం చేశారు. ఈనేపథ్యంలో 14వ జాతీయ అవయవదానం (నేషనల్ ఆర్గాన్ డొనేషన్ డే) దినోత్సవంలో భాగంగా శుక్రవారం హైదరాబాద్ గాంధీ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన జీవన్‌దాన్ కార్యక్రమంలో నర్సయ్యను సన్మానించారు. కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఆర్థిక ఇబ్బందులతో గొర్రెల కాపరి బలవన్మరణం



రామడుగు: దేశరాజ్‌పల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి అమరగొండ రాజయ్య(53) ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. రాజయ్య గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం దేశరాజ్‌పల్లి ఎక్స్ రోడ్డు సమీపంలో పురుగుల మందు తాగి పడిపోయాడు. గమనించిన దారివెంట వెళ్లేవారు కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. ఆటోలో కరీంనగర్ ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. భార్య కనకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేందర్ తెలిపారు.

అగ్నిప్రమాదంలో సామగ్రి దగ్ధం



కాలిపోయిన ఫ్రిజ్

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీలో శుక్రవారం మెండే రజిత ఇంట్లో అగ్ని ప్రమాదం సంభవించింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూలేరు. కరెంట్ షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో సుమారు రూ.1.50లక్షల విలువైన గృహోపకరణాలు మంటల్లో కాలిబూడిదయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై సతీశ్ కేసు నమోదు చేసుకొన్నారు.

మహిళను కిడ్నాప్ చేసిన ఐదుగురి అరెస్ట్

వీణవంక: మహిళను కిడ్నాప్‌చేసిన ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. చల్లూరు గ్రామానికి చెందిన శివరాత్రి అక్షయ అదేగ్రామానికి చెందిన కొంచెం సంతోష్ ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. గతనెల 22న వివాహం చేసుకున్నారు. కూతురు ప్రేమ పెళ్లి ఇష్టంలేని తల్లి శివరాత్రి గంగాజమున, బాబాయ్ శివరాత్రి శంకర్, పల్లెపు రాజు, పల్లెపు రజిత, శివరాత్రి రాజలింగం శుక్రవారం ఉదయం సంతోష్ ఇంటికి వెళ్లి నోటికొచ్చినట్లు మాట్లాడి ఇంటి తలుపులు పగులగొట్టి అక్షయను కిడ్నాప్ చేశారు. అడ్డుకునే ప్రయత్నం చేసిన సంతోష్ తల్లిపై దాడిచేశారు. చంపుతామని బెదిరించారు. ఘటనపై అక్షయ భర్త సంతోష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ అనంతరం నిందితులను అరెస్టు చేసి హుజూరాబాద్‌లో కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై వివరించారు. కిడ్నాప్‌నకు గురైన అక్షయను తిరిగి సంతోష్ కు అప్పగించినట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

- నారాయణపూర్‌లో విషాదం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై



సురేశ్‌గౌడ్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని నారాయణపూర్‌కు చెందిన లింగాల సురేశ్‌గౌడ్(26) అనే యువకుడు శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. సంఘటన స్థలాన్ని ఎస్సై రమాకాంత్ పరిశీలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మూడు రోజుల క్రితం మహారాష్ట్ర నుంచి వచ్చిన సురేశ్‌గౌడ్ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని రాచర్లగొల్లపల్లికి వెళ్లే రహదారిలో గల మహేంద్ర షోరూం వద్ద అనుమానాస్పద పరిస్థితుల్లో మృతిచెంది పడి ఉన్నాడు. మహారాష్ట్రలో కూలీ పనులు చేసుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్న సురేష్‌గౌడ్ కొంతకాలంగా మధుమేహం వ్యాధితో బాధపడుతున్నట్లు తెలిసింది. ఈక్రమంలోనే అతని మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టినట్లు, గుండెపోటుతో మరణించినట్లు లేదా ఎవరైనా కొట్టి చంపారా.. అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సిరిసిల్ల ఏరియాస్పత్రికి తరలించారు. సురేశ్‌గౌడ్ మృతితో తల్లితండ్రులు బాల్‌రాజు, ఎల్లవ్వ, భార్య శ్రావణి, కుమారుడు అన్విత్, కుతూరు రితన్య రోడ్డున పడ్డారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

పరామర్శ కరువాయే...

- సంచలనంగా వృద్ధురాలిని కుక్కలు పీక్కుతిన్న ఘటన
- స్పందించని నాయకులు, అధికారులు
- గ్రామస్తుల నుంచి విమర్శలు

ముస్తాబాద్(సిరిసిల్ల): నిద్రిస్తున్న వృద్ధురాలిపై వీధికుక్కలు దాడిచేసి పీక్కుతిన్న ఘటనపై అధికారులు, నాయకులలో మానవత్వం కరువైంది. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన వీధికుక్కల దాడి ఘటనపై మానవత్వం మాయమైంది. ముస్తాబాద్ మండలం సేవాలాల్‌తండా పరిధిలోని బట్టోనితాళ్లలో పిట్ల రామలక్ష్మి అనే వృద్ధురాలిని వీధికుక్కలు బుధవారం అర్ధరాత్రి దాడి చేసి చంపివేసిన సంగతి తెలిసిందే. రామలక్ష్మి తలభాగం, కడుపు, చేయి, కాళ్ల భాగాలను పీక్కుతిన్న సంఘటనతో జిల్లా ఉలిక్కిపడింది. బాధ్యులైన పంచాయతీ అధికారులు, రెవెన్యూ అధికారులు కనీసం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఓదార్చే ప్రయత్నం చేయలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ నిండు ప్రాణం వీధికుక్కల దాడికి బలికాగా కనీసం సంఘటన ఎలా జరిగిందో విచారణ చేసే తీరిక పంచాయతీ అధికారుల్లో కొరవడిందనే విమర్శలు వస్తున్నాయి. సంఘటన జరిగిన రోజున కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు మినహా ఏ ఇతర నాయకులు బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పే ప్రయత్నం చేయకపోవడం విచారకరం. ప్రభుత్వం తరఫున ఏ ఒక్క అధికారి సంఘటన వివరాలను క్షేత్రస్థాయిలో తెలుసుకోలేకపోయారంటే మానవత్వం ఎక్కడుందని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

థమ్సప్ అనుకుని గడ్డిమందు తాగి..

- చికిత్స పొందుతూ యువరైతు మృతి



ప్రభాకర్(ఫైల్)

గొల్లపల్లి(ధర్మపురి): దమ్మన్నపేట గ్రామానికి చెందిన యువరైతు బొలిశెట్టి ప్రభాకర్ (35) థమ్సప్ అనుకుని పొరపాటునా గడ్డిమందు తాగగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. ప్రభాకర్‌ది వ్యవసాయ కుటుంబం. గత నెల 22న తనకు చేబదులుగా వచ్చినవారికి పనికి వెళ్లాడు. అక్కడ ఓ కూలీ పొలంలో జంబుకొట్టడానికి వచ్చాడు. అతను గడ్డిమందును మరో వ్యక్తి వద్ద చేబదలు తీసుకుని థమ్సప్ సీసాలో పోసి ఒడ్డున పెట్టాడు. ఈక్రమంలో మధ్యాహ్నం అలసిపోయి ఒడ్డుకు చేరుకున్న ప్రభాకర్ గడ్డి మందును థమ్సప్ అనుకుని తాగే క్రమంలో థమ్సప్ కాదని తెలియడంతో ఉమ్మివేశాడు. అప్పటికే గుక్కెడు కడుపులోకి పోవడంతో అదేరోజు జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. కాగా అతడి భార్య శిరీష భర్తను కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడింది. చికిత్స నిమిత్తం రూ.18 లక్షల వరకు అప్పు చేసి ఖర్చుచేసింది. అయినా ప్రభాకర్ మృతితో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. మృతుడికి కొడుకు లింగేశ్వర్, కూతురు వైష్ణవి ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య

- ఎలుకల మందు తాగి మృతి
- గల్ఫ్‌లో ఉన్న భర్త రాక కోసం శవ జాగరణ



స్రవంతి(ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని నారాయణపూర్‌కు చెందిన వివాహిత సకినాల స్రవంతి(36) కడుపునొప్పి భరించలేక ఎలుకల మందు తాగి శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడింది. భర్త గల్ఫ్‌లో ఉండగా, అతని చివరిచూపు కోసం మృతదేహాన్ని ఫ్రీజర్‌లో ఉంచి కుటుంబ సభ్యులు, బంధువులు శవజాగరణ చేస్తున్నారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. ముస్తాబాద్ మండలం గూడెంకు చెందిన స్రవంతికి నారాయణపూర్‌కు చెందిన దేవరాజుతో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం కన్నయ్య, మిన్ను. స్రవంతి కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. పలు ఆస్పత్రులు తిరిగినా నొప్పి తగ్గలేదు. చివరికి తీవ్రమైన నొప్పితో భరించలేక ఎలుకలమందు తాగింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందింది. కాగా కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మృతురాలి భర్త దేవరాజు ఉపాధి కోసం గల్ఫ్ దేశంలో ఉంటున్నాడు. తండ్రి బొప్ప శంకరయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

తాళం వేసిన ఇళ్లే లక్ష్యం

- గంభీరావుపేటలో ఓ ఇంట్లో దొంగతనం



గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేటలో తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్నారు. వరుస దొంగతనాలతో మండల కేంద్ర ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. తాజాగా గురువారం మండల కేంద్రానికి చెందిన దుద్దెడ విజయ ఇంట్లో దొంగలు పడ్డారు. విజయ అత్తమ్మ అనారోగ్యంతో రెండు నెలల క్రితం చనిపోవడంతో ఇంటికి తాళం వేసి అద్దె ఇంట్లో ఉంటోంది. శుక్రవారం తెల్లవారుజామున ఇంటికి వెళ్లి చూడగా తాళాలు పగులగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో దాచిన ఐదు గ్రాముల బంగారం, 9 గ్రాముల చెవికమ్మలు, మూడు గ్రాముల మాటీలు, ముక్కుపుడక, ఉంగరం, 10 తులాల వెండిని దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్, గంభీరావుపేట ఎస్సై రామ్మోహన్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలిపై దాడిచేసిన వ్యక్తి అరెస్ట్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్లబొప్పాపూర్‌కు చెందిన రాకం నర్సవ్వ(62)పై దారి విషయంలో దాడిచేసిన అదే గ్రామానికి చెందిన బత్తుల రాజును శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. ఇంటి స్థలం దారి విషయంలో వృద్ధురాలికి నిందితునికి మధ్య కొంతకాలంగా వివాదం ఉంది. ఈ విషయంలో గత నెల 26న నర్సవ్వతో రాజు ఘర్షణపడి కర్రలతో దాడిచేశాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి రాజును రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

కట్నం వేధింపుల కేసు నమోదు

జమ్మికుంట: అదనపు కట్నం కోసం వేధించిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వరంగంటి రవి శుక్రవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జమ్మికుంటకు చెందిన రమ్యకు హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఇందిరానగర్ కాలనీకి చెందిన కొల్లోజు శ్రీనివాసచారితో 2010లో వివాహమైంది. ఆ సమయంలో కట్నకానుకలు, ఇతర లాంఛనాలు అప్పగించారు. వీరికి కుమారుడు జన్మించాడు. తరువాత భర్త కొల్లోజు శ్రీనివాస్‌చారి, అత్తమామలు ఆంద్రయ్య, సుశీల, బావ, తోటికోడలు సత్యనారాయణ మమత, మరిది, తోటికోడలు దేవేందర్, నిత్య కలిసి రూ.5లక్షల అదనపు కట్నం తేవాలని వేధిస్తున్నారు. ఈ విషయమై 2017 నుంచి 2023 వరకు పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ జరిగింది. అయినా వేధింపులు ఆగకపోవడంతో రమ్య జమ్మికుంట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

'ట్రినిటీ'లో బోనాల వేడుక



బోనాలతో విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ట్రినిటీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బోనాల పండుగ విశిష్టతపై సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు. అలాగే వానాకాలంలో ప్రకృతి అందించే వాతావరణ విశేషాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా మాన్‌సూన్ ఫెస్ట్ వేడుక నిర్వహించారు.

రేపు కరీంనగర్‌లో జిల్లాస్థాయి ఈతపోటీలు

గోదావరిఖనిటౌన్: తొమ్మిదో తెలంగాణ జిల్లాస్థాయి ఈతపోటీలు ఈనెల 4న కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు స్విమ్మింగ్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి టి.కృష్ణమూర్తి శుక్రవారం తెలిపారు. వాటర్‌పోలో విభాగంలో మహిళలు, పురుషులకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తారన్నారు. ప్రతిభ కనబర్చిన స్విమ్మర్లు ఈనెల 18న సికింద్రాబాద్‌లోని జీహెచ్‌ఎంసీలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఈతపోటీలకు అర్హత సాధిస్తారని ఆయన పేర్కొన్నారు.

ఒలింపియాడ్‌లో 'అల్ఫోర్స్'కు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులతో నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి: స్థానిక అల్ఫోర్స్ ఇ–టిక్నో పాఠశాల విద్యార్థులు సిల్వర్ జోన్ ఇంటర్నేషనల్ ఇన్ఫర్మేటిక్ ఒలింపియాడ్‌లో బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారని విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులు జోయల్‌డేవిస్, కృష్ణచైతన్య, మనీష్, అనిరుధ్, వర్షిత్‌సాయి, శ్లోక, సర్వేశ్, ధ్రువ్ శర్మ, అభిరా మ్, కృష్ణప్రతీక్ రెడ్డి, ఓంతేజలను శుక్రవారం పాఠశాలలో అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అత్యాచారయత్నం చేసిన యువకుడి అరెస్టు

కరీంనగర్‌క్రైం: యువతిపై అత్యాచారయత్నానికి పాల్పడ్డ యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కరీంనగర్ వన్‌టౌన్ సీఐ సరిలాల్ తెలిపిన వివరాలు. రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి మండలానికి చెందిన చింతం వంశీకృష్ణ (21) కరీంనగర్ జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్‌లో ఒక అద్దె ఇంట్లో ఉంటూ డిగ్రీ చదువుతున్నాడు. మంచిర్యాల చెందిన యువతితో ఏడాది కిత్రం పరిచయం ఏర్పడడంతో ఇద్దరు సన్నిహితంగా ఉన్నారు. శుక్రవారం సదరు యువతిని తన గదికి రమ్మని అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. భయాందోళనకు గురైన యువతి కేకలు వేస్తూ గదిలో నుంచి పరుగులు తీసింది. బాధితురాలి ఫిర్యాదుతో శుక్రవారం కేసు నమోదు చేసిన పోలీసులు వంశీకృష్ణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



'అల్ఫోర్స్'లో బోనాల వేడుకలు

రామడుగు: రామడుగు మండలం గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ పాఠశాలలో ఆషాఢం బోనాల వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు బోనాలతో ఊరేగింపు నిర్వహించి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బోనాల వేడుకలు తెలంగాణ సాంప్రదాయాలకు చిహ్నామని అన్నారు.